
నవ్య వీక్లి - విశ్వపతి చిన్న కథల పోటీలో బహుమతి పొందిన కథ

# వాయసం



"**అ**నగా అనగా ఒక కాకి వుందంట............"

"కాకి వ్వాట్?"

"కాకిరా. నల్లగా ఉండే పక్షి. మనింట్లోని ఎంగిలి మెతుకులు తినడానికి మన దొడ్లోకొస్తుందీ అదీ....!"

"దొడ్డి? వాట్సిట్ గ్రాండ్ ఫా?"

"బడికెల్తన్నావన్నారు. కాకి తెలీదా?" పరమాశ్చర్యంగా అడిగారు సుబ్బయ్య.

"నో" అన్నాడు మనవడు.

"రేపు చూపిస్తాన్లే. కాకి శనిదేవుడి వాహనంరా బుజ్జీ"

"వ్వాట్ వాహనం?"

"పోనీ దేవుళ్ళందరికీ పశువులో పక్షులో వాహనంగా వుంటాయనైనా తెలుసా?"

తల అడ్డంగా ఊపాడు.

"కాకి అరిస్తే చుట్టాలొస్తారంటారు కదా. అదైనా తెలుసా?"

పెదవి విరిచాడు.

"చచ్చేను! నీకెలా చెబితే అర్థమవుద్దిరా. ఏం ఇంగ్లిపీసు చదువులో ఏంటో!" గొణుక్కుంటూ చిచ్చుకొట్టారు.

తాత పొట్టమీద చేయి వేసి నిశ్చింతగా నిద్రలోకి జారుకున్నాడు.

'ఈ పట్నవాసంలో ఇంకెన్ని వింతలు చూడాలో ఏవోఁ!' తనలో తనే గొణుక్కున్నారు.

సుబ్బయ్య పల్లెనుంచి ఆ మహా నగరానికి అవాళే వచ్చారు. ఇదివరకు ఒకటి రెండు శుభకార్యాలకొచ్చినా చుట్టపు చూపుగా వచ్చి వెళ్ళారు. కానిప్పుడు ఇక్కడ వుండిపోవడానికే వచ్చారు.

ఇన్నేళ్ళూ కొడుకూ కోడలూ ఎంత పోరినా పల్లె తల్లిని వదల్టానికి ఇష్టపడలేదు. కాళ్ళూ చేతులూ ఆడినంత కాలం రామని తెగేసి చెప్పేరు. వయస్సుడిగినా శక్తి సన్నగిల్లుతున్నా అలాగే వ్యవసాయం చేస్తూ వచ్చారు. ఆ మధ్య భార్య చనిపోయింది. ఇంత ఉడకేసి పెట్టేవారు లేక నానా ఇబ్బందీ పడుతున్నారు. అయినా నేల తల్లినీ పశుపక్షుల్నీ ఊరిజనాన్నీ వదలి పట్నం రావడానికి ఒప్పుకోలేదు.

మొన్న మొన్ననే డబ్బై అయిదో పడిలో పడ్డారు. ఆరోగ్యం మందగించింది. పొలం పనులు చూసుకోలేకపోతున్నారు. అదీగాక ఆయన తండ్రీ తాతా కూడా డబ్బై అయిదేళ్ళే బతికారు. తనూ అంతేకాలం బతుకుతాననుకున్నారు. అంచేత ఆఖరి రోజులు కొడుకు దగ్గర వెళ్ళదీద్దామని వచ్చారు.

మర్నాడు పళ్ళు తోముకుంటూ కిందికి తొంగి చూస్తోంటే, "ఏం చూస్తున్నారు మావయ్యగారూ" అడిగింది కోడలు.

"నేల కన్పిస్తుందేమోననీ....."

నవ్వింది. "మన ఫ్లాటు ఇరవై ఒకటో అంతస్తులో వుంది. కాళ్ళకింది నేల కన్పించదు. దూరంగా ఎక్కడో నల్లగా కన్పిస్తుందంతే"

"గాలిలో వేలాడుతున్నామన్నమాట!"

క్షణకాలం దిగ్భ్రమ చెంది, ఆ వెంటనే నవ్వేసింది.

"చద్దన్నం వడ్డించు తల్లీ" పై పంచెతో ముఖం తుడుచుకుంటూ అన్నారు.

కోడలు అయోమయంగా చూస్తోంటే, "రాత్రి మిగిలి పోయిన అన్నంలో ఇంత గంజిపోసి వూరబెట్టి, పొద్దుటే గంజి పిండి మజ్జిగో పెరుగో పోసుకుని తింటారు. దాన్ని చద్ది అన్నం అంటారు" వివరించాడాయన కొడుకు.

'ఇప్పుడెలా' అన్నట్టు చూసిందామె.

"ఏదుంటే అది పెట్టు తల్లీ" కోడలి ఇబ్బంది గమనిస్తూ అన్నారు.

"పొద్దునే టిఫిన్ చెయ్యడం అవ్వదు మావయ్యగారూ. అందుకని ఓట్సో, కార్న్‌ఫ్లాక్సో తినేస్తూంటాం. పండుకీ ఇవే ఇష్టం" అంటూ పాలల్లో ఓట్సు వేసిచ్చింది.

"ఇవేం గింజల్రా"

"ఓట్సు నాన్నా"

"ఆహా. ఎక్కడ పండుతాయేంటి"

"విదేశాల్నుంచి ఇంపోర్టు చేస్తారు"

అర్థం కానట్టు చూశారుగాని మరి రెట్టించలేదు.

పండు డ్రెస్ తొడుక్కు రాగా ""దొరబాబులా వున్నావురా" అని మురిసిపోయారు.

పుస్తకాల బ్యాగ్ సర్దుతూ సాక్సు వెదుకుతూ కోడలు హడావిడి పడుతోంటే అన్నారు "మొన్ననే కదూ రెండేళ్ళు నిండిందీ. అప్పుడే బడిలో వేశారేం?"

"ప్లే స్కూలు. ఆడుతూ పాడుతూ అన్నీ నేర్పిస్తారు"

"బయటెక్కడా జానెడు నేల కన్పించట్లేదు...!"

"ఇండోర్ గేమ్సు ఆడిస్తారు"

కోడలు పండుని క్రిందికి తీసుకెళ్తోంటే అనుసరించారు సుబ్బయ్య.

ఖద్దరు పంచె, ఖద్దరు చేతుల బనీను, పై పంచె ధరించిన మావగారి వంక ఇబ్బందిగా చూసింది. ఆయన పట్టించుకోలేదు.

లిఫ్టులో క్రిందికెళ్ళారు. స్కూల్ వ్యాన్ ఎక్కి 'బై' చెప్పాడు పండు.

ఎనిమిదిన్నరకి వెళ్ళి పన్నెండున్నరకి వస్తాడనీ, ముప్ఫై ఐదువేలు ఫీజు అనీ చెప్పగా "ఆరెకరాల పంట!" అని ఆశ్చర్యపడ్డారు.

"నేనలా ఓ సుట్టు తిరిగి వస్తానమ్మా. నువ్వెళ్ళు....."

"అన్ని బ్లాకులూ ఒకే రకంగా వుంటాయి. కన్ఫ్యూజ్ అవుతారు. ఈ ఆర్నమెంటల్ ప్లాంట్స్, ఫ్లవర్స్ కేవలం చూట్టానికే. కోయకూడదు. ఆ గ్రీనరీ మీద కూర్చోకూడదు....!"

"రాత్రి బుజ్జిగాడికి కాకి కథ చెబుతోంటే కాకి ఎలా వుంటుందని అడిగాడమ్మా. ఎక్కడున్నాయో చూచి రేపు చూపిద్దామనీ....!"

"కాకులూ పిచ్చుకలూ ఇక్కడెక్కడా కన్పించవు. ఈ కాంక్రీటు జంగిల్లో ఊపిరాడకా, సెల్ టవర్ల ధాటికి తట్టుకోలేకా ఎప్పుడో అంతరించి పోయాయి!"

బాధగా చిత్రంగా చూశారాయన. "అవి లేకపోతే పురుగూ పుట్రా రాకుండా ఎవరు కాపలా కాస్తారు? అయినా పశు పక్షులకింత తిండి విదపకుండా అంతా మనమే బొక్కేస్తామా?! మా నాన్న అన్నం తినే ముందు మొదటి ముద్దని పెరటిగోడమీద పెట్టేకే తినేవాడు. దాన్ని కాకులు గోల చేస్తూ తినేవి. ఇప్పటికీ మా వీథి చూరుకి వరికంకుల కుప్పని పిచ్చుకల కోసం వేలాడదీస్తూంటాం!"

"ఇంకవన్నీ పపుస్తకాల్లో చదువుకోవాల్సిందేనండి"

సుబ్బయ్య గుండెలు బరువెక్కాయి.

పండు చేత కోడలు హెూం వర్కు చేయిస్తోంటే, ఆ ప్రక్కనే చతికిలబడి పుస్తకాలు తిరగెయ్యసాగారు.

పులి, సింహం, నక్క, కుక్క, కుందేలు, ఎలుక, పిల్లి, జీబ్రా, ఒంటె....ఇలాటి జంతువుల బొమ్మలే కన్పించాయి. ఒక చోట పావురాలున్నాయి. కాని కాకి గాని, పిచ్చుకగాని కన్పించక పోయేసరికి ఆశ్చర్యబోయి ప్రశ్నించారు.

"ఇవి ఇతర దేశాల పుస్తకాలు. అక్కడి పశుపక్షులే వీటిల్లో ఉంటాయి"

"ఏంటో కలికాలం! అద్సరేగాని అమ్మాయ్. ఎవరైనా పోయినప్పుడు పిండాన్ని చేటలో పెట్టి ఇంటికప్పుమీద పెడతారు. పితృదేవతలు కాకి రూపంలో వచ్చి తింటారు. అలా తింటేనే వాళ్ళకి కైవల్యం లభిస్తుందంటారు. మరిక్కడ...ఈ భవంతి పైనెక్కడో పెడతారా? అంతెత్తుకి కాకులు ఎగ్రిరాలేవు కదా!" మనస్సులో పీడిస్తోన్న అనుమానాన్ని బయట పెట్టారు.

"అబ్బే అలాటివేం ఇక్కడ చూళ్ళేదు. శ్మశానంలో చేస్తారేమో!"

"ఆహా. అక్కడికి కాకులొస్తాయి కామోసు! పిండాలని కాకులు తినడానికి రాకపోతే చనిపోయినవారికి తీరని కోరికలు ఉండిపోయాయని అనుకునే వాళ్ళం. అవి తీరుస్తాం అని చెప్పి దణ్ణం పెట్టుకున్నాకే కాకులు ముట్టేవనుకో"

'పిచ్చి నమ్మకాలు!' పైకి అనలేదు. లోపలనుకుంది కోడలు.

"నీకు తెలుసా తల్లీ. కోయిలకి గుడ్లు పొదగటం రాదు. వాటిని తెచ్చి కాకి గూట్లో పెడుతుంది. కాకికి లెక్క తెలిసిపోద్దని కాకి గుడ్లని క్రింద పారేస్తుంది. పాపం పిచ్చికాకి అవి తన గుడ్లే అనుకుని పొదుగుతుంది. గుడ్లలోంచి పిల్లలు బయటికొచ్చి కూకూ అని

కూత పెట్టేసరికి మోసం తెలిసి తరిమేస్తుంది....!"

"మళ్ళీ చెప్పు గ్రాండ్‌ఫా......" ఆసక్తిగా అడిగాడు పండు.

"రేపు చెబుతార్లేగాని ముందు కలర్స్ వెయ్యి. లేకపోతే మేడమ్ బ్యాడ్ అంటుంది" కసిరింది తల్లి.

సుబ్బయ్య ఆరోగ్యం మరింత దిగజారింది. చిత్రంగా కాకుల బెంగ ఎక్కువగా పీడిస్తోందాయన్ని.

"ఇక్కడి సొశానంలోకి కాకులొస్తాయిట్రా అబ్బాయ్" ఒకరోజున కొడుకుని అడిగారు.

'ఏమో మరి. ఎప్పుడూ వెళ్ళలేదు. ఈ మధ్యెక్కువగా ఎలక్ట్రిక్ క్రిమెటోరియంలో దహనం చేస్తున్నారు"

కలవరపడ్డారు. "నన్ను మాత్రం సొశానంలోనే కాల్చొరేయ్. కాకుల కింత పిండాకూడు పెట్టడం మర్చిపోకు సుమా"

చిన్నగా నవ్వి "అలాగేలే" అన్నాడు కొడుకు.

అదేం చిత్రమో గాని ఆ సంభాషణ జరిగిన మూడ్రోజులకే నిద్రలోనే పోయారు సుబ్బయ్య.

తండ్రి ఆఖరి కోరిక ప్రకారం శవాన్ని ట్రక్కు మీద శ్మశానానికి తీసుకెళ్ళి దహనం చేశాడు. అక్కడే వండి పిండం పెట్టి వచ్చేశాడు.

కాకుల కావు కావులు విన్పించలేదు.

కుక్కలు మాత్రం ఎగబడ్డాయి!

**(నవ్య వారపత్రిక 20.3.2013)**